

కొణతాలతో కేవీపీ మంతనాలు?

కాంగ్రెస్‌లోకి రావాల్సిందిగా ఆహ్వానం

ఆయన వెంటే వైసీపీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి?



విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో రాజకీయ మార్పులు చకచకా చోటుచేసుకుంటున్నాయి. అధికార పార్టీ వైసీపీ కొన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను మార్చడం, ఎన్నికల బరిలో ఎవరు ఉంటారో స్పష్టత ఇవ్వడంతో ఆయా నియోజకవర్గాల్లో టికెట్లు ఆశిస్తున్న వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వాణిజ్య పన్నుల శాఖ మంత్రిగా చేసిన కొణతాల రామకృష్ణ ఇప్పుడు రాజకీయంగా మళ్లీ క్రియాశీలకం అవుతున్నారు. రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం కొణతాల...జగన్ వెంట నడిచారు. అయితే ఆయన విధానాలు నచ్చక పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. అప్పటి నుంచి ఏ పార్టీలోనూ చేరలేదు. ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అయితే గత కొద్దిరోజులుగా ఆయన మళ్లీ తన వర్గంతో చర్చలు జరుపుతున్నారు. ఉత్తరాంధ్రాతో పాటు ముఖ్యంగా అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ఆయన శిష్యులు చాలామంది ఉన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్‌లో చేరబోతున్నారు. ఆమె రాష్ట్ర పార్టీ బాధ్యతలు స్వీకరిస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె తరఫున కేవీపీ రామచంద్రరావు పాత కాంగ్రెస్ నాయకులందరితో చర్చలు జరుపుతున్నారు. కేవీపీకి కూడా కొణతాల రామకృష్ణ సన్నిహితుడే. కాంగ్రెస్‌లోకి రావాలని కేవీపీ ఆహ్వానించినట్టు, అందుకు కొణతాల అంగీకరించినట్టు ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్ వైపు నాగిరెడ్డి అడుగులు?

వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వలేమని గాజువాక ప్రస్తుత ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి వైసీపీ అధిష్ఠానం చాలా స్పష్టంగా చెప్పేసింది. పార్టీ అవకాశం ఇస్తే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయన తనయుడు దేవన్‌రెడ్డి ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అధిష్ఠానం టికెట్ ఇవ్వబోమని చెప్పడంతో పార్టీకి రాజీనామా చేయడానికి సిద్ధమయ్యారు. పార్టీ పెద్దలు బుజ్జగించి తొందర పడవద్దని వారించారు. రెండు రోజుల క్రితం గాజువాకలో జరిగిన పార్టీ సమావేశంలో కూడా నాగిరెడ్డి వర్గీయులు ఆయనకే టికెట్ ఇవ్వాలని పార్టీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి ముందు డిమాండ్ చేశారు. అయితే ఉరుకూటి చందుకే టికెట్ ఇవ్వనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో ... మిగతా 8వ పేజీలో

అరకు వైసీపీలో తిరుగుబాటు!

ఎంపీ మాధవికి అసెంబ్లీ టికెట్ ఇస్తారన్న సమాచారంతో పలువురు నేతలు సమావేశం

స్థానికులకే సీటు ఇవ్వాలని అధిష్ఠానానికి డిమాండ్

ఐకమత్యంతో పనిచేస్తామని వెల్లడి

వేరే నియోజకవర్గం వారికి ఇస్తే ఓటమి ఖాయమని విస్పష్టం



అరకులోయలోని గిరిజన భవన్‌లో సమావేశమైన వైసీపీ నాయకులు

అరకులోయ, జనవరి 2: రానున్న ఎన్నికల్లో వైసీపీ అధిష్ఠానం అరకులోయ అసెంబ్లీ టికెట్‌ను ఎంపీ జి.మాధవికి ఇస్తున్నట్టు సమాచారం రావడంతో నియోజకవర్గం పరిధిలో పలువురు ఆశావహులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. వివిధ మండలాలకు చెందిన నేతలు మంగళవారం ఇక్కడ సమావేశం అయ్యారు. తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పనిచేస్తామని, స్థానికేతరులకు టికెట్ ఇస్తే ఓడించి తీరుతామని అధిష్ఠానాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి, తమ అభిప్రాయాలను కుండ బద్ధలుకొట్టినట్టు చెప్పారు.

అనంతగిరి మాజీ ఎంపీపీ, సీనియర్ నాయకుడు శెట్టి గంగాధరస్వామి మాట్లాడుతూ, అరకులోయ నియోజకవర్గంలో పరిధిలోని వారికి కాకుండా వేరే ప్రాంతం వారికి టికెట్ ఇస్తే తాను ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. పాడేరు నియోజకవర్గానికి చెందిన ఎంపీ మాధవికి అరకు అసెంబ్లీ టికెట్ ఇస్తారన్న సమాచారం మేరకు తన అభిప్రాయాన్ని అధిష్ఠానానికి తెలియజేస్తున్నట్టు చెప్పారు. పార్టీ పెద్ద తమ వైఖరి మార్చుకుని అరకులోయ అసెంబ్లీ పరిధిలోని వ్యక్తికి టికెట్ ఇస్తే, ఆ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానన్నారు.

అరకులోయకు చెందిన సమర్డి రఘునాథ్ మాట్లాడుతూ, అరకులోయ నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాల్లో సమర్థులైన నాయకులు వుండగా వేరే నియోజకవర్గం వారికి టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఏజెన్సీ నుంచి ఇప్పటివరకు కొటియా మినహా మిగిలిన ప్రధాన సామాజిక వర్గాల వారు ఎమ్మెల్యేలుగా పనిచేశారని, ఈ దఫా కొటియా సామాజిక వర్గానికి చెందిన తనకు టికెట్ కేటాయించాలని కోరారు. హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, నియోజకవర్గం పరిధిలో ఏ వ్యక్తికి టికెట్ ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని, ఐక్యంగా పనిచేసి గెలిపించుకుంటామన్నారు. మాధవికి టికెట్ ఇస్తే ఓడిపోవడం ఖాయమన్నారు. హుకుంపేటకు చెందిన వైసీపీ యువ నాయకుడు నాయని సత్తిబాబు మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గానికి చెందిన మాధవికి అరకులోయ అసెంబ్లీ సీటు ఇస్తే తాము పనిచేయలేమని స్పష్టం చేశారు.

పెదబయలు మండలానికి చెందిన కోడ సింహాద్రి మాట్లాడుతూ, వైసీపీ ఆవిర్భావం నుంచి అరకులోయ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం ఎంతోమంది పనిచేస్తున్నారని, అధిష్ఠానం సర్వే చేయించి స్థానిక నేతల్లో ఎవరికి గెలుపు అవకాశాలు వుంటే ఆ వ్యక్తికి టికెట్ ఇవ్వాలని కోరారు. అలా కాకుండా వేరే నియోజకవర్గం వారికి టికెట్ ఇస్తే అరకులోయలో గెలుపుపై ఆశలు వదులుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అనంతగిరి మండలం పెదగంగవరం గ్రామానికి చెందిన కొరతం ఈశ్వరరావు, పలు మండలాలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు హాజరయ్యారు.



మాధవి | భాగ్యలక్ష్మి | విశ్వేశ్వరరాజు | చెట్టి పాల్గుణ

వైసీపీ చదరంగం!

మన్యంలో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు కొత్త ఇన్‌చార్జిలు

అరకులోయ పార్లమెంట్‌కు భాగ్యలక్ష్మి

పాడేరు అసెంబ్లీ... మత్స్యరాస విశ్వేశ్వరరాజు

అరకులోయ అసెంబ్లీ.. జి.మాధవి.. వచ్చే ఎన్నికల్లో వీరికే టికెట్లు?

అరకులోయ సిట్టింగ్ ఎమ్మెల్యే ఫాల్గుణకు ఝలక్

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

అధికార వైసీపీ పెద్దలు మన్యంలో రాజకీయ చదరంగం ఆడుతున్నారు. గత రెండు వారాలుగా ప్రచారం జరుగుతున్నట్టుగానే వైసీపీ ... మిగతా 8వ పేజీలో



దాడి వీరభద్రరావు | రత్నాకర్ | జయవీర్

వైసీపీకి దాడి గుడ్‌బై

అధికార పార్టీకి వరుస షాక్‌లు

పార్టీని వీడుతున్న సీనియర్లు

ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌ల రాజీనామా

ఇప్పుడు వీరభద్రరావు కుటుంబం...

నేడు అమరావతిలో చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరిక

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అధికార పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. ఎన్నికల ముంగిట పలువురు సీనియర్ నేతలు పార్టీని విడిచిపెడుతున్నారు. సుమారు ఏడాదిపాటు విశాఖ జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా పనిచేసిన పంచకర్ల రమేశ్‌బాబు మూడు, నాలుగు నెలల క్రితం పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన విషయం తెలిసిందే. ఇక ఇటీవల వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ వైసీపీకి గుడ్‌బై చెప్పారు. వీరిలో వంశీకృష్ణ జనసేనలో చేరగా, సుధాకర్ టీడీపీలో చేరనున్నట్టు చెబుతున్నారు. తాజాగా అనకాపల్లి జిల్లాలో వైసీపీకి మరో గట్టి దెబ్బ తగిలింది. సీనియర్ రాజకీయవేత్త, మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, ఆయన తనయుడు, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్, మరో కుమారుడు జయవీర్ మంగళవారం మధ్యాహ్నం వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో కలకలం రేపగా, వైసీపీలో ప్రకంపనలు సృష్టిస్తున్నది.

మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సుదీర్ఘకాలంపాటు తెలుగుదేశం పార్టీలో ఉండి, 2013లో ఆ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో ఆయన కుమారుడు దాడి రత్నాకర్ విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం దాడి వీరభద్రరావు కుటుంబం వైసీపీ నుంచి బయటకు వచ్చింది. కొంతకాలంపాటు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరతారన్న ఊహాగానాలు వినిపించాయి. అయితే ఏం జరిగిందో తెలియదుగానీ..2019 సార్వత్రిక ఎన్నికల ముందు మళ్లీ వైసీపీలో చేరారు. అనకాపల్లి అసెంబ్లీ టికెట్ రాకపోవడంతో ఒకింత నిరాశ చెందారు. అయినప్పటికీ వైసీపీ విజయం కోసం కష్టపడి పనిచేశారు. పార్టీ అధికారంలోకి రావడంతో తగిన ప్రాధాన్యం లభిస్తుందని భావించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు/ఎంపికలు ... మిగతా 8వ పేజీలో



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన జేసీ కార్తిక్, ఐటీడీఏ పీవో అభిషేక్

ఎన్నికల ప్రక్రియలో అప్రమత్తం

20 రోజుల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించండి

సమస్యలు, సదుపాయాలను పరిశీలించాలి

జోనల్ అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

పాడేరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియలో జోనల్ అధికారులు అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. ఐటీడీఏ కార్యాలయంలో ఎన్నికల జోనల్ అధికారులతో మంగళవారం నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పరిధిలోని ఈవీఎంలు, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బందిపై పూర్తిస్థాయిలో అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ఎన్నికల సామాగ్రి, పోలింగ్ అధికారులు, సిబ్బంది కేటాయించిన వాహనాల్లో మాత్రమే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. దారిలో ఎక్కడా వాహనాలను ఆపకూడదన్నారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందని, ఈ క్రమంలో మాక్ పోలింగ్, పోలింగ్ ప్రారంభంపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ప్రిసైడింగ్ అధికారుల డైరీ సక్రమంగా నిర్వహించి, పోలింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు జిల్లా ఎన్నికల అధికారికి అందించాలన్నారు. జోనల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను 20 రోజుల్లో సందర్శించి రవాణాకు అనుకూలంగా రహదారులు ఉన్నాయా? లేవా? పరిశీలించి వివరాలు తెలపాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నివేదించాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేసి, అదనపు పోలీసు బలగాలను నియమిస్తామన్నారు.

ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ, జోనల్ అధికారులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులతో గత ఎన్నికల తీరుపై చర్చించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు, సమస్యలు సృష్టించే వారిని ముందుగానే గుర్తించాలని, పాఠశాలలు లేదా ప్రభుత్వ శాశ్వత భవనాల్లో మాత్రమే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. జోనల్ పరిధిలో పోలింగ్ కేంద్రాలపై రూట్ మ్యాప్‌లను తయారు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సదుపాయాల కల్పనపై నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి వీవీ రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ఏ ఉద్యోగులు 14వ రోజు సమ్మె శిబిరంలో వినూత్నంగా ఉరేసుకొని నిరసన తెలుపుతున్న దృశ్యం

వైసీపీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ఎస్ఎస్ఏ ఉద్యోగులు వినూత్న నిరసన

పాడేరురూరల్, జనవరి 2: ఒక్క ఛాన్స్ అంటూ అన్ని వర్గాల ప్రజలకు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత మోసగించిన వైసీపీ పాలకులకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. 14 రోజుల నుంచి సమ్మె చేస్తూ ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మాట తప్పను, మడం తిప్పను అని తరచూ చెప్పుకునే సీఎం జగన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు అంగన్‌వాడీలు, పారిశుధ్య కార్మికులు, వెలుగు వీవోఏలు, సీహెచ్‌డబ్ల్యూలు, ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్రాన్ని ఆందోళనాంధ్రప్రదేశ్‌గా మార్చి, ఏపీకి రాజధాని లేకుండా చేసిన జగన్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని అన్నారు. కాగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఉరితాళ్లను మెడకు బిగించుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు వి.జయరాజు, ఎం.అనిల్‌కుమార్, పి.సింహాచలం, గౌరీశంకర్, వెంకటరమణ దొర, సుభద్ర అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పెదబయలులో ఆశ వర్కర్లతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలపై సర్కారు ఉక్కుపాదం?

5వ తేదీలోగా సమ్మె విరమించాలని అల్టిమేటం

లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ ద్వారా ప్రకటన

ప్రభుత్వ వైఖరిపై అంగన్‌వాడీలు ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మూడు వారాలుగా నుంచి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై చర్యలకు వైసీపీ ప్రభుత్వం ఉపక్రమిస్తున్నది. ఈ నెల ఐదో తేదీలోగా సమ్మె విరమించి విధుల్లో చేరకుంటే నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టడడంతోపాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడతామని కలెక్టర్ల ద్వారా ఆదేశాలు జారీ చేయించింది.

గత ఎన్నికల ముందు పాదయాత్ర చేసిన సమయంలో ఇచ్చిన హామీలను సీఎం జగన్మోహన్‌రెడ్డి నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు గత నెల 12వ తేదీ నుంచి సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ పేరుతో ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను స్వాధీనం చేసుకుని తెరిపించింది. అయితే ఇది మూన్నాళ్ల ముచ్చటగా మారడంతో పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలని ప్రయత్నించి మరోమారు విఫలమైంది. తాజాగా జిల్లా కలెక్టర్ల ద్వారా అంగన్‌వాడీలకు అల్టిమేటం జారీ చేసింది. అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం చాలా చేసిందని, మిలిగినవి సైతం చేస్తుందని, అంగన్‌వాడీ కేంద్రాల మూతతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాహారం అందక ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీల సమ్మె కారణంగా ఆహార భద్రతా చట్టం అమలుకు విఘాతం కలుగుతున్నందున ఈ నెల ఐదో తేదీలోగా కచ్చితంగా విధుల్లో చేరాలని, లేకుంటే ప్రత్యామ్నాయ ... మిగతా 8వ పేజీలో

సబ్ కలెక్టర్‌కు సమస్యలు ఏకరువు

అదనపు ఎస్పీతో కలిసి మారుమూల గ్రామాల్లో పర్యటన

సాగు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని గిరిజనులు వినతి



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

గూడెంకొత్తవీధి, జనవరి 2: గిరిజనులు పంటలు పండించుకుంటున్న భూములకు సాగు హక్కు పత్రాలు పంపిణీ చేస్తామని పాడేరు సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. చింతపల్లి అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్‌తో కలిసి మంగళవారం కొయ్యూరు-జీకేవీధి మండలాల సరిహద్దులో వున్న జి.కొత్తపాలెం, మండపల్లి, కొమ్ముసంపంగి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆదివాసీలు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. చాలా కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలులేక పోవడంతో ప్రభుత్వ పథకాలు, రాయితీలు, పంట రుణాలు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జి.కొత్తపాలెంలో బడిఈడు పిల్లలు, చిన్నారులు ఉన్నప్పటికీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు లేకపోవడం వల్ల చదువుకోవడానికి మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లివస్తున్నారని చెప్పారు. తమ గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

మండపల్లి గ్రామం కొయ్యూరు మండల పరిధిలో వుందని, రేషన్, అంగన్‌వాడీ సరకుల కోసం 30 కిలోమీటర్ల దూరంలో వున్న పంచాయతీ కేంద్రం మఠంభీమవరం వెళ్లాల్సి వస్తున్నదని వాపోయారు. ఐదు కిలోమీటర్ల దూరంలో వున్న జీకేవీధి పంచాయతీ నుంచి అంగన్‌వాడీ, రేషన్ సరకులు ఇవ్వాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరిస్తామనని తెలిపారు. ఈ మూడు గ్రామాల్లో అర్హులైన వృద్ధులందరికీ పింఛన్ల మంజూరు కోసం దరఖాస్తు చేయించాలని, ఆధార్ కార్డుల కోసం మొబైల్ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్ చేయించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావును ఆదేశించారు. ప్రతి సోమ, గురువారాలు జీకేవీధిలో మొబైల్ ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని చెప్పారు. గిరిజనుల సాగులో న్ను భూములను వెంటనే సర్వే చేసి తనకు నివేదిక పంపించాలని డీటీ కుమారస్వామిని ఆదేశించారు. భూముల సర్వే, ఆధార్ నమోదును 15 రోజుల్లో పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అన్నారు. అనంతరం గిరిజన యువకులకు వాలీబాల్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ అశోక్ కుమార్, ఎస్ఐఅప్పలసూరి, ఆర్ఐ మహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

'తాచేరు'లో వృద్ధురాలి మృతదేహం


రాజులమ్మ (ఫైల్ ఫొటో)

మాడుగుల రూరల్, జనవరి 2 : మండలంలోని ఎం.కె.వల్లాపురం గ్రామానికి చెందిన మట్టా రాజులమ్మ (72) అనే వృద్ధురాలి మృతదేహం మంగళవారం ముకుందపురంలోని తాచేరు నదిలో బయటపడింది. గత నెల 27వ తేదీన పొలానికి వెళుతున్నానని చెప్పి ఆమె ఇంటి నుంచి బయటకు వచ్చింది. అప్పటి నుంచి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆమె కొడుకులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ముకుందపురం వద్ద తాచేరు నదిలో రాజులమ్మ మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించి ఎస్ఐ దామోదరనాయుడుకు సమాచారం అందించారు. వెంటనే ఆయన అక్కడికి చేరి అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పొలం సమీపంలో ఉన్న నదికి వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయి ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అనకాపల్లి టౌన్, జనవరి 2: స్థానిక అన్నపూర్ణ బ్యాంక్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడినట్టు ట్రాఫిక్ ఎస్ఐ ఎన్. సత్యనారాయణ తెలిపారు. గుండాలవీధిలో నివాసముంటున్న మొల్లి సన్నిబాబు తన కుమారుడికి ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రికి వెడుతుండగా చోడవరం వైపు నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ద్విచక్ర వాహన చోదకుడు ఢీకొన్నాడని తెలిపారు. ఈ సంఘటనలో సన్నిబాబుకు తీవ్రగాయాలు కావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, సన్నిబాబు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

వైసీపీ నక్కపల్లి అధ్యక్షుడికి తీవ్ర గాయాలు


గాయపడిన నరసింహమూర్తి

ఎస్.రాయవరం, జనవరి 2: వైసీపీ నక్కపల్లి మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తికి అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆయన స్వగ్రామం సారిపల్లి వానిపాలెం నుంచి అడ్డరోడ్డులో ఇంటికి బైక్‌పై వెళుతుండగా కుక్క అడ్డు రావడంతో పడిపోయాడు. దీంతో అతనికి తీవ్ర గాయాల య్యాయి. గాయప డిన నరసింహ మూర్తిని అడ్డరోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు వెంటనే ఆస్పత్రికి చేరుకొని వైద్యులను ఆరా తీయగా.. క్షతగాత్రుడిని విశాఖ తీసుకువెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యే బాబూరావు వెంటనే ప్రైవేట్ అంబులెన్స్‌లో నరసింహమూర్తిని అనకాపల్లి ఉషాప్రేమ్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆయనకు అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిసింది. ఆయన వెంట ఎమ్మెల్యే బాబూరావు కూడా వెళ్లారు.

పూడిమడక వైన్‌షాపులో చోరీ

అచ్యుతాపురం రూరల్, జనవరి 2: మండలంలోని పూడిమడక ప్రభుత్వ మద్యం దుకాణంలో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. రాత్రి సమయంలో షాపులోని రూ.50 వేల నగదు, కొన్ని మద్యం బాటిళ్లు అపహరించినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో పోలీసులు విచారణ చేస్తున్నారు. షాపులో పనిచేసే వారి చేతివాటమా లేదా నిజంగానే చోరీ జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తమ దృష్టికి వచ్చిందని సీఐ బుచ్చిరాజు తెలిపారు.

వైద్యుడిపై లైంగిక వేధింపుల ఆరోపణలు?

- ఇంట్లో పనిమనిషి ఫిర్యాదు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు ఆరోపణలు రావడంతో కేజీహెచ్‌లో పనిచేస్తున్న ఒక వైద్యుడిపై మహారాణిపేట పోలీసులు మంగళవారం కేసు నమోదుచేసినట్టు తెలిసింది. సదరు వైద్యుడు లైంగిక దాడికి పాల్పడ్డారంటూ ఆయన ఇంట్లో పనిచేస్తున్న మహిళ ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు రామాటాకీస్ సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రిలో సదరు వైద్యుడు ఉన్నట్టు తెలుసుకుని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లారంటున్నారు. మఫ్టీలో ఆస్పత్రికి వెళ్లిన పోలీసులను గుర్తించి వైద్యుడు ...మొదటి అంతస్థు నుంచి వెనుక వైపునున్న ర్యాంప్ మీదుగా కిందకు దిగి పరారైనట్టు సమాచారం. వైద్యుడు తన కారును కూడా ఆస్పత్రి వద్ద వదిలేశారు. ఆయన పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసు గురించి మహారాణిపేట పోలీసులతోపాటు ఈస్ట్ ఏసీపీని సంప్రతించేందుకు యత్నించగా...బిజీగా ఉన్నామని, తర్వాత మాట్లాడుదామంటూ సమాధానం దాటవేశారు.

అట్రాసిటీ కేసులో నలుగురి అరెస్టు

కశింకోట, జనవరి 2 : మండలంలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన నలుగురు నిందితులను ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద అరెస్టు చేసినట్టు అనకాపల్లి రూరల్ సీఐ ఎ.రవి కుమార్ మంగళవారం రాత్రి తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2023 డిసెంబరు 31న అర్ధరాత్రి పొన్నాడ యాకోబు (రిటైర్డ్ టీచర్) గ్రామంలో ఉన్న చర్చిలో నూతన సంవత్సరం సందర్భంగా ప్రార్థనలకు హాజరై తిరిగి ఇంటికి నడుచుకొని వెళుతుండగా అదే గ్రామానికి చెందిన మంతెన దుర్గా నాగ ఈశ్వర్, చిన్ని మధుమోహన్‌సాయి, పెయ్యల గణేష్, కలం ఏసు అనే నలుగురు కులం పేరుతో దూషించి, అతనిపై దాడికి పాల్పడ్డారన్నారు. ఈ మేరకు డీఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి నలుగురిని అరెస్టు చేశామని సీఐ రవికుమార్ తెలిపారు.

6న నృసింహ దీక్షల విరమణ



సింహాచలం, జనవరి 2: సింహాచలం క్షేత్ర మహత్యం, సింహాద్రినాథుని అవతార రహస్యం చాటి చెప్పే లక్ష్యంతో భక్తులు నవంబరు 26న స్వీకరించిన నృసింహ దీక్షల విరమణ ఈనెల 6న జరగనుంది. ఇందులో భాగంగా సింహగిరిపై భక్తుల తిరుముడుల స్వీకరణకు చేస్తున్న ప్రత్యేక ఏర్పాట్లను ఈవో సింగాల శ్రీనివాసమూర్తి మంగళవారం పరిశీలించారు. ఈనెల 6న ఉదయం 7 గంటల నుంచి ఆలయ దక్షిణ రాజగోపురానికి సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో చందనస్వాములు ఇరుముడులను సమర్పించాలని ఈవో తెలిపారు. దీక్షల విరమణకు వచ్చే భక్తులకు దేవస్థానం బస్సులలో ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తామన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ముందు రోజు ఉచిత వసతి, భోజన సదుపాయాన్ని కలుగజేస్తామన్నారు. దీక్ష దారులకు ఉచిత దర్శనం కల్పిస్తామన్నారు. ఆయన వెంట ఏఈఓలు పి.నరసింగరావు, భ్రమరాంబ, ఈఈలు డీజీ శ్రీనివాసరాజు, బి.రాంబాబు, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

నిఘా నీడన లంబసింగి

- పోలీసుల నిరంతర గస్తీ
- రాత్రి వేళల్లో విస్తృత సోదాలు


ఉదయం లంబసింగిలో మోహరించిన పోలీసులు


మంగళవారం ఉదయం నాలుగు గంటలకు వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చింతపల్లి, జనవరి 2: ప్రముఖ పర్యాటక ప్రాంతం, ఆంధ్రకశ్మీర్ లంబసింగిపై పోలీసులు నిఘా పెంచారు. మూడు రోజులుగా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. 24 గంటలూ గస్తీ నిర్వహిస్తున్నారు. లంబసింగి మీదుగా వచ్చిపోయే వాహనాలు, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను విస్తృతంగా సోదాలు చేస్తున్నారు. లంబసింగి వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ఎంజాయ్ చేసేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. దీంతో గత నెల 31వ తేదీ నుంచి మంగళవారం వరకు లంబసింగి, చెరువులవేనం, తాజంగి, రాజుపాకలు తదితర ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడుతున్నాయి. దీంతో స్థానిక అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ ఆదేశాలతో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సీఐ కె.రమేశ్, ఎస్ఐ అరుణ్‌కిరణ్ అధ్వర్యంలో గస్తీ నిర్వహిస్తున్నారు. లంబసింగిలో నూతన సంవత్సర వేడుల్లో మునిగి తేలుదామని ఆశతో వచ్చిన మందుబాబులకు పోలీసులకు కళ్లెం వేశారు. తాజంగి-లంబసింగి, రాజుపాకలు-లంబ్బంగి మార్గాల్లో ఎక్కడా మద్యం తాగడానికి పర్యాటకులకు అనుమతించలేదు. రిసార్ట్ వద్ద కూడా డీజే సౌండ్స్, మద్యం తాగే అవకాశం ఇవ్వలేదు. లంబసింగి జంక్షన్‌లో పోలీసులు బ్రీత్ అనలైజర్ పరీక్షలు, 24 గంటలూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అతి వేగంగా ప్రయాణించిన వాహనాలను స్వాధీనం చేసుకుని మరుసటి రోజు తిరిగి అప్పగిస్తున్నారు. లంబసింగి జంక్షన్, తాజంగి, భీమనాపల్లి వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా కేటాయించిన స్థలాల్లో మాత్రమే వాహనాల పార్కింగ్‌కు అనుమతులు ఇస్తున్నారు. పోలీసులు లంబసింగిలో భారీగా మోహరించడం, శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో కుటుంబాలతో ఇక్కడికి వచ్చిన పర్యాటకులు ప్రశాంతంగా గడిపి చేసి వెళుతున్నారు. కాగా లంబసింగిలో పర్యాటక సీజన్ ముగిసేంత వరకు పోలీసు గస్తీ కొనసాగుతుందని స్థానిక అదనపు ఎస్పీ శివకిశోర్ తెలిపారు.

ఆర్‌టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఎన్ఎంయూ అసోసియేషన్ ప్రతినిధుల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

మాకవరపాలెం, జనవరి 2: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులంతా ఐక్యంగా ఉంటే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మండలంలోని రాచపల్లిలో గల కామేశ్వర్మ గుడి వద్ద మంగళవారం ఏర్పాటైన అనకాపల్లి జిల్లా యూనిట్ అసోసియేషన్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. ఈపీఎస్ 95 నుంచి సీపీఎస్‌కు మార్చే గడువును ఎత్తివేసి ఎప్పుడైనా అప్షన్ ఇచ్చుకునే విధానాన్ని అమలు చేయాలని, ఈహెచ్ఎస్ నుంచి ఏపీపీడీటీ ఉద్యోగులను మినహాయించి పాత పద్ధతిలోనే వైద్య విధానం కల్పించాలని కోరారు. అలాగే, సంస్థ నుంచి ఉద్యోగులకు రావలసిన ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఏకపక్షంగా షెడ్యూల్స్ రద్దు చేయాలని, గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి మోహన్‌రావు, విజయనగరం జోనల్ కార్యదర్శి మూర్తి, జోనల్ జాయింట్ కార్యదర్శి బోళం రమణ, ప్రతినిధులు శంకరరావు, సూర్యంతో పాటు నర్సీపట్నం డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

కైలాసగిరిపై సైన్స్ మ్యూజియం నిర్మాణం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శంకుస్థాపన
- ఏడాదిలోగా పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటన

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిపై అడ్వాన్స్‌డ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణాన్ని ఏడాదిలో పూర్తిచేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. రూ.6 కోట్లతో మ్యూజియం నిర్మాణానికి మంగళవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మ్యూజియం కోసం రూ.4.69 కోట్లు కేంద్రం ఇవ్వగా సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంస్థ రూ.93.8 లక్షలు సమకూరుస్తుందని వివరించారు. మ్యూజియంలో 3డీ ఆర్ట్ గ్యాలరీ, సిలికాన్ మ్యూజియం, సోలార్ స్పేస్ టెక్నాలజీకి సంబంధించిన అంశాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ సీఈఓ డాక్టర్ జయరామిరెడ్డి, వీఎంఆర్‌డీఏ కమిషనర్ మల్లికార్జున, జాయింట్ కమిషనర్ రవీంద్ర, సెక్రటరీ డి.కీర్తి తదితరులు పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డులో సెంటర్ డివైడర్ పనులకు ఏర్పాట్లు

నర్సీపట్నం, జనవరి 2 : పట్టణంలోని మెయిన్ రోడ్డులో సెంటర్ డివైడర్ పనులకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పాల్‌ఘాట్ కూడలి నుంచి సెంట్రింగ్ పనులు మంగళవారం ఆరంభయ్యాయి. అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు రూ.10.6 కోట్లతో రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. అంబీద్ సెంటర్ నుంచి పాత ఎస్‌బీఐ సెంటర్ వరకు 90 అడుగులు రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న ప్రభుత్వ భవనాల తొలగింపు ప్రక్రియను పూర్తి చేశారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు తొంభై శాతం పూర్తయ్యాయి. పాల్‌ఘాట్ కూడలిలోని ఎస్సీ బాలికల వసతి గృహం, సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రహరీ గోడలను తొలగించారు. డివైడర్ నిర్మాణం పూర్తిచేసి సంక్రాంతిలోగా బీటీ రోడ్డు వేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

- సూరత్-బ్రహ్మపూర్ ప్రత్యేక రైలు పొడిగింపు

విశాఖపట్నం, జనవరి 2: సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా సికింద్రాబాద్, బ్రహ్మపూర్, వికారాబాద్‌కు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

సికింద్రాబాద్-బ్రహ్మపూర్-వికారాబాద్

07089 నంబరు గల రైలు ఈనెల 7, 14 తేదీల్లో రాత్రి 7.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 11.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07090 నంబరు గల రైలు ఈనెల 8, 15 తేదీల్లో మధ్యాహ్నం 12.30 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 8.30 గంటలకు వికారాబాద్ చేరుతుంది. 07091 నంబరు గల రైలు ఈనెల 9, 16న సాయంత్రం 6.00 గంటలకు వికారాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 11.10 గంటలకు బహ్మపూర్ చేరుతుంది. తిరిగి 07092 నం బరు గల రైలు ఈనెల 10, 17న మధ్యాహ్నం 12.30 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 6.30 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ రైళ్లకు మూడు సెకెండ్ ఏసీ, ఆరు థర్డ్ ఏసీ ఎకానమీ, తొమ్మిది స్లీపర్, రెండు జనరల్ సెకెండ్ క్లాసు, ఒక సెకెండ్ క్లాస్ కమ్ లగేజీ కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి. రద్దీని దృష్టిలో పెట్టుకుని వయా దువ్వాడ మీదుగా సూరత్ నుంచి బ్రహ్మపూర్ వచ్చే 09069 నంబరు రైలును ఈనెల 17, 24, 31 తేదీల్లో...బ్రహ్మపూర్ నుంచి సూరత్ వెళ్లే 09070 నంబరు గల రైలును ఈనెల 19, 26, ఫిబ్రవరి 2 తేదీల్లో అందుబాటులో ఉండే విధంగా పొడిగించినట్టు డీసీఎం పేర్కొన్నారు.

అభిజిత్ కంపెనీలో మెరుపు సమ్మె


విధులను బహిష్కరించి కంపెనీలో నుంచి బయటకు వస్తున్న కాంట్రాక్టు కార్మికులు

అచ్యుతాపురం రూరల్, జనవరి 2: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అభిజిత్ ఫెర్రోటెక్ లిమిటెడ్ కంపెనీ కాంట్రాక్ట్ కార్మికులు మెరుపు సమ్మెకు దిగారు. దీంతో నో వర్క్, నో పే అంటూ కంపెనీ యాజమాన్యం మంగళవారం నోటీసు జారీ చేసింది. సోమవారం ఉదయం విధులకు హాజరైన కాంట్రాక్ట్ కార్మికులు మెరుపు సమ్మెకు దిగి, మిగతా కార్మికులు విధులకు హాజరవకుండా అడ్డుకున్నారు. మంగళవారం కూడా కార్మికులు విధులకు హాజరు కాలేదు. కంపెనీకి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మెరుపు సమ్మెకు దిగడంతో కంపెనీ యాజమాన్యం ఫర్నేస్‌లు నిలిపివేసింది. దీంతో కంపెనీకి నష్టం వాటిల్లిందని, వెంటనే విధులకు హాజరు కావాలని కంపెనీ ఎదుట నోటీసు పెట్టింది. రెండు రోజులు నో వర్క్, నో పే ప్రకటించింది. గతంలో చర్చించిన విధంగా 20 పనిదినాలకు అంగీకారం తెలిపిన వారు వెంటనే కాంట్రాక్టర్‌కు తెలిపి విధులకు చేరాలని యాజమాన్యం పేర్కొంది.

కార్మిక శాఖ సహాయ కమిషనర్‌గా వసంతరావు బాధ్యతల స్వీకారం


వసంతరావు

కొత్తూరు, జనవరి 2 : అనకాపల్లి జిల్లా కార్మిక శాఖ ఇన్‌చార్జి సహాయ కమిషనర్ కె.వసంతరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేర కు విజయవాడ కార్మిక కమిషనర్ ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈయన ఏలేరు సహాయ కార్మిక కమిషనర్‌గా, విశాఖపట్నంలో సోషల్ సెక్యూరిటీ ప్రమోషన్ ఆఫీర్ (ఎస్‌హెచ్‌పీవో)గా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కార్మికులకు సంక్షేమ పథకాలు అందేంచేందుకు కృషి చేస్తానని చెప్పారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ స్కీం, ఎన్‌పీఎస్ స్కీమ్‌ను అసంఘటిత కార్మికులు, వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





అంగన్‌వాడీల శిబిరం వద్ద మాట్లాడుతున్న బొర్రా నాగరాజు

చంద్రబాబు దృష్టికి అంగన్‌వాడీల సమస్యలు

» పంచాయతీరాజ్ చాంబర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా నాగరాజు

పాడేరు రూరల్, జనవరి 2: రాష్ట్రంలో అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పంచాయతీ చాంబర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా నాగరాజు హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారానికి 22వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు కొనసాగిస్తున్న నిరసన శిబిరాన్ని నాగరాజు సందర్శించి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో జగన్‌రెడ్డి అధికార దాహంతో అన్ని వర్గాల చిరుద్యోగులకు హామీలను గుప్పించారన్నారు. అధికారంలోకి వచ్చాక వారిని మోసగించడం వల్లే రాష్ట్రం నేడు ఆందోళనాంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేని జగన్‌కు వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పడం తథ్యమన్నారు. మంగళగిరిలోని సీకే కన్వెర్షన్ హాలులో బుధవారం నిర్వహించే రాష్ట్ర స్థాయి పంచాయతీరాజ్ సదస్సుకు హాజరుకానున్న చంద్రబాబు దృష్టికి ఈ సమస్యలను తీసుకు వెళ్తానన్నారు. అంగన్‌వాడీలు తెలుగుదేశం పార్టీకి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో నిర్వీర్యమైన పంచాయతీ వ్యవస్థను రక్షించుకొనేందుకు, హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న పోరాట సభకు పార్టీలకతీతంగా జిల్లాలోని 22 పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నాయకులు భాగ్యలక్ష్మి, చిన్నారి, ఇందిర, జయ, విజయ, లక్ష్మి, కొండమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలి

» అరకులోయ ఎంపీ గొడ్డేటి మాధవి



పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎంపీ మాధవి, పక్కన ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని అరకులోయ పార్లమెంటు సభ్యురాలు గొడ్డేటి మాధవి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను రూ.3 వేలకు పెంచారన్నారు. పాడేరు మండలంలో 6,788 మంది పింఛనుదారులకు రూ.2.77 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే పెన్షన్ సొమ్ము కోసం ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులకు రావాల్సిన అవసరం లేకుండా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందిస్తున్నట్టు చెప్పారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ రూ.3 వేలు పెన్షన్ పెంపు ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. అలాగే సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు రూ.10 వేలు పెన్షన్‌గా అందిస్తున్నారన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు పెంచిన పింఛన్ల సొమ్మును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో డి.శాంతలక్ష్మి, ఎంపీపీ ఎస్.రత్నకుమారి, ఎంపీడీవో సాయినవీన్, ఈవోపీఆర్‌డీ రమేశ్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల మందు పార్టీ!

అంతా పదో తరగతిలోపు వారే...



పార్టీలో మునిగి తేలుతున్న విద్యార్థులు

చోడవరం, జనవరి 2: వారంతా ఎనిమిది నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు...డిసెంబరు 31వ తేదీ రాత్రి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మందు పార్టీ చేసుకోవడం స్థానికంగా కలకలం రేపింది. అనకాపల్లి జిల్లా చోడవరంలో ఈ ఉదంతం చోటుచేసుకుంది. స్థానిక కో-ఆపరేటివ్ కాలనీలోని బీసీ బాలుర వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులు 31వ తేదీ రాత్రి పక్కన నిర్మాణంలో ఉన్న భవనంలో మందు పార్టీ చేసుకున్నారు. వీరితో స్థానికంగా ఉన్న మరో ఇద్దరు యువకులు జత కలిశారు. బీరు తాగుతుండడాన్ని ఆ ఇద్దరు యువకులలో ఒకరు తన సెల్‌ఫోన్‌తో చిత్రీకరించడంతో విద్యార్థులు గొడవకు దిగారు. ఆ తరువాత కొంతసేపటికి అంతా సద్దుమణిగింది. అయితే విద్యార్థుల మందు పార్టీకి సంబంధించిన వీడియో మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ హాస్టల్ కొంతకాలం ఇన్‌చార్జి వార్డెన్ ఆధ్వర్యంలో నడిచింది. ఇప్పుడా ఇన్‌చార్జి వార్డెన్ చిన్నయ్యే రెగ్యులర్ వార్డెన్‌గా బాధ్యతలు చేపట్టారు. వార్డెన్ దిగువ స్థాయి సిబ్బందిపై భారం వేసి, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే విద్యార్థులపై అజమాయిషీ కొరవడిందని స్థానికు అంటున్నారు.

పది గంటల వరకూ హాస్టల్‌లోనే ఉన్నా: వార్డెన్ చిన్నయ్య

కాగా హాస్టల్ విద్యార్థులు అందరూ మందు పార్టీలో మునిగితేలుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నా వార్డెన్ చిన్నయ్య మాత్రం 31వ తేదీ రాత్రి పది గంటల వరకూ తాను హాస్టల్‌లోనే ఉన్నానని, ఆ తరువాత ఇంటికి వెళ్లానని చెబుతున్నారు. తాను హాస్టల్ నుంచి వెళ్లిన తరువాత విద్యార్థులు ఏం చేశారో తెలియన్నారు. మళ్లీ ఆయనే...ఎవరో తాగుతుంటే చూడడానికి తమ హాస్టల్ విద్యార్థులు వెళ్లారు తప్పితే, వారు తాగలేదని చెప్పడం కొసమెరుపు.

ఆకర్షణీయంగా చాపరాయి

» రూ.40 లక్షల వ్యయంతో ఆధునికీకరణ పనులు


» నేడు జిల్లా కలెక్టర్‌తో పునఃప్రారంభోత్సవం

డుంబ్రిగుడ, డిసెంబరు 2: జలవిహారిగా పేరుగాంచిన చాపరాయి జలపాతం కొత్తరూపును సంతరించుకుంది. మన్యం పర్యటనకు విచ్చేసే ప్రతీ పర్యాటకుడు చాపరాయిలో జలకాలాడకుండా వెళ్లరంటే అతిశయోక్తికాదు. అధిక సంఖ్యలో పర్యాటకులు విచ్చేస్తున్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పాటు పరిసరాల్లో పారిశుధ్యం లోపించడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా చాపరాయి వద్ద జలకాలాడిన తర్వాత దుస్తులు మార్చుకునే అవకాశం లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే



చాపరాయి వ్యూ వీక్షించే పగోడాలు





టైల్స్‌తో సుందరంగా మారిన సందర్శకులు నడిచే బాటలు, ఇతర ప్రాంతాలు... (ఇన్‌సెట్‌లో) స్టోన్ నేమ్‌తో చాపరాయి పేరు

మరుగుదొడ్లు, తాగునీరు అందుబాటులో లేక సందర్శకులు అవస్థలు పడుతున్నారు. దీంతో చాపరాయిలో అసౌకర్యాలు, పర్యాటకుల అవస్థలపై 'ఆంధ్రజ్యోతి' అనేక మార్లు ప్రత్యేక కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో పాటు చాపరాయిని అభివృద్ధి చేయాలనే డిమాండ్ల మేరకు గతంలో ఐటీడీఏ పీవోగా పని చేసిన రోణంకి గోపాలక్రిష్ణ అవసరమైన చర్యలు చేపట్టారు. తరువాత ఆయన బదిలీ కావడంతో ప్రస్తుతం పీవో వి.అభిషేక్ ప్రత్యేక దృష్టిసారించారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో చాపరాయి ఆధునీకరణకు అవసరమైన చర్యలు చేపట్టారు. చాపరాయి పేరు అందంగా కన్పించేలా ఆకర్షణీయమైన నేమ్‌స్టోన్, చుట్టూ ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయంతో పాటు పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు సమకూర్చారు. అలాగే తగిన రక్షణ చర్యలు చేపట్టారు. దీంతో గతానికి భిన్నంగా చాపరాయి ప్రాంతం ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నది. సోమ, మంగళవారాలు తుది మెరుగులుదిద్దారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా బుధవారం సాయంత్రం చాపరాయిని పునఃప్రారంభించేందుకు ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు.

మన్యంలో కొనసాగుతున్న పొగమంచు

» అరకులోయలో 13, పాడేరులో 14.8 కనిష్ఠ ఉష్ణోగ్రతలు

పాడేరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నప్పటికీ చలి తీవ్రత, పొగమంచు కొనసాగుతున్నది. ఏజెన్సీలో అరకులోయలో 13, పాడేరులో 14.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు మంగళవారం నమోదయ్యాయి. శీతాకాలం నేపథ్యంలో మరికొన్ని రోజులు చలి వాతావరణం కొనసాగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సూచిస్తున్నది. ప్రస్తుతం శీతాకాలం, ఉత్తరాది నుంచి చలిగాలులు వీస్తుండడంతో చలి తీవ్రత కొనసాగుతున్నది. దీంతో మన్యంలో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగా పొగ మంచు కురుస్తున్నది. ఏజెన్సీలో రోడ్లు స్పష్టంగా కన్పించకపోవడంతో హెడ్ లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే మధ్యాహ్నం వేళలో మోస్తరుగా ఎండ కాస్తూ, సాయంత్రం మూడు గంటల నుంచే చలి ప్రభావం మొదలవుతున్నది. దీంతో ఏజెన్సీ వాసులు మంటలు కాగుతూ, ఉన్ని దుస్తులు ధరిస్తూ చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

చింతపల్లిలో 15.3 డిగ్రీలు...

చింతపల్లి: చింతపల్లిలో మంగళవారం 15.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం



పాడేరు- చింతపల్లి మెయిన్ రోడ్డులో మంగళవారం ఉదయం పొగమంచు

నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. ఈ నెలాఖరు వరకు గిరిజన ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పారు. చలితో పాటు మంచు దట్టంగా కురుస్తున్నది. అర్ధ రాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం పదిన్నర గంటల వరకు లంబసింగి, జీకే వీధి, చింతపల్లి, తాజంగి ప్రాంతాల్లో మంచు దుప్పటి కప్పుకుంటుంది. సాయంత్రం, ఉదయం వేళల్లో గృహాల్లోనూ, వీధుల్లోనూ మంటలు పెట్టుకుని స్థానిక ప్రజలు చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

ప్రభుత్వం దిగొచ్చేవరకు ఆందోళనలు కొనసాగిస్తాం

» వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్తిబాబు

» మన్యంలో కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె, నిరసనలు

చింతపల్లి/ముంచంగిపుట్టు/డుంబ్రిగుడ/జి.మాడుగుల/పెదబయలు, జనవరి 2: ప్రభుత్వం దిగొచ్చేవరకు అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళనలు కొనసాగిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సెగ్గె సత్తిబాబు స్పష్టం చేశారు. డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మన్యంలో కొనసాగుతోంది. మంగళవారం చింతపల్లి, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, జి.మాడుగుల, పెదబయలులో మండలాల్లో వినూత్నంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. చింతపల్లిలో కళ్లను చేతులతో మూసుకుని నినాదాలు చేశారు. ఈ శిబిరాన్ని సత్తిబాబు సందర్శించి మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు 22 రోజులుగా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్న సీఎం జగన్‌కు చీమకుట్టినట్టు కూడా లేకపోవడం విచాకరమన్నారు. ఒక్క అవకాశమంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అధికారం శాశ్వతమనే భ్రమలో ఉండడం సరికాదన్నారు. మరో మూడు నెలల్లో ప్రజలు చరిత్ర తిరగరాస్తారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైన అంగన్‌వాడీల డిమాండ్లపై స్పందించకపోతే ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పెంటమ్మ, రాములమ్మ, అక్కమ్మ, లక్ష్మి, రాజేశ్వరి, సత్యవతి, నీలమ్మ పాల్గొన్నారు. ముంచంగిపుట్టులో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంగన్‌వాడీలు



చింతపల్లిలో జగన్ తీరుకు వ్యతిరేకంగా కళ్లు మూసుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు...



ముంచంగిపుట్టులో గోమాతకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం



డుంబ్రిగుడలో థింసా నృత్యం చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు

గోమాతకు అందించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా డిమాండ్లు నెరవేర్చేవరకూ తగ్గేదే లేదని అంగన్‌వాడీలు తెగేసి చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ, గిరిజనసంఘం, సీపీఎం, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కె.శంకరరావు, బి.సత్యవతి, ఎస్.ఈశ్వరమ్మ, మౌలమ్మ, పార్వతి, సుజాత, కాంతమ్మ, భవానీ పాల్గొన్నారు. డుంబ్రిగుడ మండల కేంద్రంలోని థింసా నృత్యాలు చేస్తూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. న్యాయమైన సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని సంఘం మండల అధ్యక్షురాలు కొండమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించేవరకు ఆందోళనను చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సత్యావతి, పవిత్ర, మల్లమ్మ పాల్గొన్నారు. జి.మాడుగులలో అంగన్‌వాడీల నిరసన దీక్షలను బీజేపీ నేత కురుసా పార్వతమ్మ సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీల డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం బాధాకరమని వాపోయారు. కార్యక్రమంలో బీజేపీ ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ఎం.గోపాలపాత్రుడు, మండల అధ్యక్షుడు సలుగు సతీశ్‌పడాల్, నాయకులు ఎస్.చిరంజీవి, నూకరాజు, మత్స్యలింగం, అంగన్‌వాడీల సంఘం నేతలు మోద కొండమ్మ, వరహాలమ్మ, రాజేశ్వరి, కాంతమ్మ, అన్నపూర్ణ పాల్గొన్నారు. పెదబయలులో అంగన్‌వాడీలు భారీ ర్యాలీ చేశారు. వీరికి ఆశ కార్యకర్తలు మద్దతు తెలిపారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం కలెక్టరేట్ ముట్టడించనున్నట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సన్నిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మి, సుబ్బలమ్మ, ధర్మాన పడాల్, సునీల్‌కుమార్, సర్బన్న పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

నేటి నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి నరసింహులు

పాడేరు రూరల్, జనవరి 2: పశువులకు బుధవారం నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి సిహెచ్.నరసింహులు తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ టీకాల కోసం జిల్లాలో 7,17,819 ఆవులు, గేదెలను గుర్తించామన్నారు. ప్రతీ రోజు ఉదయం 6.30 నుంచి 10 గంటల వరకు టీకాలు వేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించినట్టు చెప్పారు. సిబ్బంది కోల్డ్ చైన్ విధానం పాటించేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని 22 మండలాల పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పాడేరు రూరల్, జనవరి 2: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ ఏపీ) 2024 క్యాలెండర్, డైరీతో పాటు జీవో పుస్తకాన్ని జిల్లా విద్యా శాఖాధికారి బి.గౌరీ శంకరరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.శేషగిరిరావు, నాయకులు గిడ్డి వరలక్ష్మి, ఎం.వీర్రాజు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో డీడీ విచారణ

పెదబయలు, జనవరి 2: ఏకలవ్య పాఠశాలలో గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ కొండలరావు మంగళవారం విచారణ చేపట్టారు. విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడ్డారన్న ఫిర్యాదుల మేరకు ప్రిన్సిపాల్ పి.కేశవరావును జిల్లా కలెక్టర్ సస్పెన్షన్ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు పాఠశాలలో రికార్డులను డీడీ పరిశీలించారు. కాగా, కేశవరావు స్థానంలో మరో ప్రిన్సిపాల్‌ను ఎందుకు నియమించలేదని విలేకరులు ప్రశ్నించగా, ఏటీడబ్ల్యూవో విచారణ నివేదిక ఆధారంగా పరిశీలనకు వచ్చానని ఆయన సమాధానం దాటవేయడం విశేషం.

వంజంగి మేఘాల కొండ మార్గంలో పారిశుధ్య పనులు

పాడేరు రూరల్, జనవరి 2: ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి మేఘాల కొండకు వెళ్లే మార్గంలో వ్యర్థాలను తొలగించే పనులను మంగళవారం ప్రారంభించామని ఎంపీడీవో కె.సాయినవీన్ తెలిపారు. మేఘాల పర్వతానికి పర్యాటకులు అధిక సంఖ్యలో రావడంతో పాటు వారు వినియోగించే తాగునీటి సీసాలు, ప్లాస్టిక్, ఆహార పదార్థాల కవర్లు ఎక్కువగా ఉండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 2 నుంచి 9వ తేదీ వరకు పర్యాటకుల సందర్శనకు బ్రేక్ వేసి పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు మంగళవారం వ్యర్థాలు తొలగించినట్టు ఆయన తెలిపారు.

5న గ్రూపు-2 మెటీరియల్ పంపిణీ

అరకులోయ, జనవరి 2: ఏపీపీఎస్సీ గ్రూపు-2 మెటీరియల్‌ను ఈ నెల 5వ తేదీన పంపిణీ చేస్తామని ఆదివాసీ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ తెలిపారు. ఐటీడీఏ పీవో అభిషేక్ చేతుల మీదుగా ఈ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. ఇందుకోసం అభ్యర్థులు 5వ తేదీన ఏపీ గిరిజన్ సంఘం కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వారందరికీ 5వ తేదీన మెటీరియల్ అందిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 9492131423 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

షీకాయిపాలెంలో ఇంటింటి కొళాయి

కొయ్యూరు, జనవరి 2: మండలంలోని వెలగలపాలెం పంచాయతీలో మారుమూల షీకాయిపాలెం గ్రామంలో ఇంటింటి కొళాయిలను ఎంపీపీ బడుగు రమేష్‌బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల కోరిక మేరకు ఈ పథకానికి నిధులు కేటాయించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు లోకుల సోమగాంధీ, నాయకులు జల్లి బాబులు పాల్గొన్నారు. అనంతరం అంతాడ గ్రామ సచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు.

సందడిగా తారుమారు సంత





సంతకు పోటెత్తిన జనం.. (ఇన్‌సెట్‌లో) విక్రయానికి తెచ్చిన సామగ్రి

జి.మాడుగుల, జనవరి 2: మండల కేంద్రంలో మంగళవారం తారుమారు సంత సందడిగా సాగింది. సంతబయలు గ్రామంలో సాధారణ రోజుల్లో సంత నిర్వహిస్తారు. అయితే సంక్రాంతి ముందు వారం జరిగే సంతకు పండగ సంత, తారుమారు సంతగా పిలుస్తారు. ఈ ఏడాది రెండు వారాల పాటు తారుమారు సంత నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించారు. ఇందులో భాగంగా మొదటి మంగళవారం నిర్వహించిన సంతకు మంచి స్పందన లభించింది. పరిసర గ్రామాల నుంచి గిరిజనులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. అలాగే వారు కష్టించి పండించిన పంట దినుసులను తారుమారు సంతకు తీసుకువచ్చి విక్రయాలు జరిపారు. అమ్మిన సొమ్ముతో బట్టలు, పండగకు కావాల్సిన సరకులు కొనుగోలు చేసుకున్నారు. అలాగే సంత ఆవరణలో గిరిజనుల సంప్రదాయ జీలుగు కల్లు, మడ్డి కల్లు బంధువులతో కలిసి సరదాగా తాగి ఆనందంగా గడిపారు.

ఫుడ్ పాయిజన్‌తో 23 మంది విద్యార్థినులకు అస్వస్థత

చింతూరు, జనవరి 3: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని బొడ్డుగూడెం ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 23 మంది విద్యార్థినులు మంగళవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. ఆహార కలుషితం కారణంగానే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని సమాచారం. విద్యార్థులను ఏడుగురాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థులు వాంతులతో బాధపడుతున్నారు.

పింఛన్లు ఎక్కడ?

» ఈ నెల ఇంకా పంపిణీ చేయని వలంటీర్లు డబ్బులు రాలేదని వెల్లడి

» 5న మీటింగ్‌లు నిర్వహించిన తరువాత ఇస్తారంటూ సమాచారం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పెంచిన పింఛన్లు అందుకునే భాగ్యం ఎప్పుడు?...అంటూ లబ్ధిదారులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. వైసీపీ గత ఎన్నికల సమయంలో పింఛన్లను రూ.3 వేలు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ ఏడాదికి రూ.250 చొప్పున మాత్రమే పెంచుకుంటూ వస్తోంది. మరో నాలుగు నెలల్లో ఎన్నికలు ఉన్నాయనగా...ఇప్పుడు రూ.2,750 నుంచి రూ.3 వేలు చేసింది. జనవరి ఒకటో తేదీన వీటిని పంపిణీ చేయాల్సి ఉంది. సాధారణంగా ఒకటో తేదీ ఉదయాన్నే అందరి ఇళ్లకు వచ్చి వేలిముద్రలు వేయించుకొని వలంటీర్లు డబ్బులు ఇవ్వాలి. కానీ కొత్త సంవత్సరంలో జగనన్న ప్రభుత్వం వారికి ఝలక్ ఇచ్చింది. పింఛన్లు పెంచినట్టు ప్రచారం అయితే చేసుకుంది గానీ ఇప్పటివరకూ ఏ లబ్ధిదారుడికి రూపాయి కూడా పంపిణీ చేయలేదు. వలంటీర్లను అడిగితే ఇంకా డబ్బులు రాలేదని చెబుతున్నారు. కొందరైతే ఎప్పుడు వస్తాయో కూడా స్పష్టంగా చెప్పడం లేదు. పెంచిన రూ.250కి విస్తృత ప్రచారం చేసుకొని ఇంకా డబ్బులు ఇవ్వకపోవడం ఏమిటని వృద్ధులు వాపోతున్నారు.

5న మీటింగ్‌కు వస్తేనే ఇస్తారట

దీనిపై వార్డు సచివాలయాల సిబ్బందిని ప్రశ్నించగా, డబ్బులు రాని మాట వాస్తవమేనని అంగీకరించారు. ఈ నెల ఐదవ తేదీన వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో వార్డుల వారీగా సమావేశాలు నిర్వహించి, అందరికీ అక్కడే పింఛన్లు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. అక్కడికి వస్తేనే ఈ నెల పింఛన్లు అందుతాయని, రాలేని వృద్ధులు ఎవరైనా ఉంటే వారికి ఆ తరువాత వలంటీర్లు తీసుకువెళ్లి ఇస్తారని వివరించారు. అంటే పెంచిన పింఛన్ల పంపిణీ కూడా పార్టీ కార్యక్రమంలా నిర్వహించి, ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకునే యత్నం చేస్తున్నారు.

వైసీపీ చదరంగం!

... 5వ పేజీ తరువాయి

అధిష్ఠానం అరకులోయ పార్లమెంట్‌తోపాటు పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజవర్గాలకు కొత్త ఇన్‌చార్జిలను నియమించింది. అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జిగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జిగా అరకులోయ ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు అసెంబ్లీ నియోజవర్గం ఇన్‌చార్జిగా ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు నియమితులయ్యారు. దీంతో ఏజెన్సీలో వైసీపీ శ్రేణుల్లో కలకలం రేగింది. వచ్చే ఎన్నికల్లో ఆయా స్థానాల నుంచి వీరే ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తారని ప్రచారం జరుగుతున్నది. దీంతో అరకులోయ ఎంపీగా భాగ్యలక్ష్మి, పాడేరు ఎమ్మెల్యేగా విశ్వేశ్వరరాజు, అరకులోయ ఎమ్మెల్యేగా మాధవి బరిలో దిగనున్నారని తెలుస్తున్నది.

అరకులోయ సిట్టింగ్ ఎమ్మెల్యేకు ఝలక్...

అరకులోయ అసెంబ్లీ స్థానానికి జి.మాధవిని ఇన్‌చార్జిగా నియమించడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు ఝలక్ ఇచ్చినట్టేనని స్పష్టమవుతున్నది. అయితే వచ్చే ఎన్నికల్లో పాల్గుణకు సీటు దక్కదని కొద్ది వారాలుగా ప్రచారం జరుగుతున్నది. మాధవిని ఇన్‌చార్జిగా నియమించడంతో ఇది దాదాపుగా వాస్తవమైంది. కాగా ఎంపీ జి.మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తమకు పాడేరు అసెంబ్లీ టికెట్ కావాలని గత కొన్ని రోజులుగా పార్టీ పెద్దలను కోరుతున్నట్టు తెలిసింది. అయితే చివరకు మాధవికే అధిష్ఠానం మొగ్గుచూపింది. భాగ్యలక్ష్మిని నిరాశపరచకుండా ఆమెకు అరకులోయ ఎంపీ టికెట్ ఇవ్వాలని నిర్ణయించి, ఇన్‌చార్జిగా నియమించినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇదిలావుండగా 2019 ఎన్నికల ముందు పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జిగా పనిచేసిన మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు అప్పట్లో టికెట్ ఇవ్వకుండా మొండిచేయి చూపారు. దీంతో ఆయన తీవ్ర నిరాశ చెందారు. భవిష్యత్తులో న్యాయం చేస్తామని నాడు వై.ఎస్.జగన్ హామీ ఇచ్చారు. ఆ మేరకు ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమించారు. ఇతని భార్య నాగరత్నంకు జీకేవీధి జడ్పీటీసీ టికెట్ ఇచ్చారు. తాజాగా విశ్వేశ్వరరాజును పాడేరు అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించడంతో వచ్చే ఎన్నికల్లో ఆయనే అభ్యర్థి అని ప్రచారం జరుగుతున్నది.

అంగన్‌వాడీలపై సర్కారు ఉక్కుపాదం?

... 5వ పేజీ తరువాయి

ఏర్పాట్లు చేసుకుంటామని పేర్కొన్నారు. అంటే అంగన్‌వాడీలను పక్కన పెట్టి, ఇతరులతో ఆయా పనులు చేయించుకుని కేంద్రాలను నిర్వహిస్తామని చెప్పకనే చెప్పారు. ప్రభుత్వ తీరును అంగన్‌వాడీలు తీవ్రంగా నిరసిస్తున్నారు. సమస్యలను పరిష్కరించకుండా బెదిరింపులు, దౌర్జన్యాలతో తమ ఉద్యమాన్ని నీరుగార్చాలని యత్నించడం సరికాదని అంగన్‌వాడీలు మండిపడుతున్నారు.

ఐదో తేదీలోగా విధుల్లో చేరాలి: కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు: అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెను విరమించి ఐదో తేదీ నాటికి విధుల్లో చేరాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మె కారణంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాహారం అందక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని విధుల్లో చేరాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతుందన్నారు.

వైసీపీకి దాడి గుడ్‌బై

... 5వ పేజీ తరువాయి

జరిగినప్పుడు, నామినేటెడ్ పదవుల భర్తీ సమయంలో దాడి వీరభద్రరావు కుటుంబ సభ్యుల పేర్లు తెరపైకి రావడం, పార్టీ అధిష్ఠానం మొండి చేయి చూపడం జరుగుతూ వస్తోంది. గత ఎన్నికల్లో అమర్ గెలుపునకు కృషి చేసినప్పటికీ పార్టీ పెద్దలు గుర్తించకపోవడం, ఎమ్మెల్సీ సీటు హామీని జగన్ నిలుపుకోలేకపోవడం, సొంత పార్టీ నేతలే తమపై విమర్శలు చేస్తుంటే ఎవరూ ఖండించకపోవడం తదితర పరిణామాలు దాడి వీరభద్రరావు కుటుంబాన్ని బాధించాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో మలసాల కుటుంబానికి ఎమ్మెల్యే టికెట్ కోసం మంత్రి అమర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సిఫారసు చేయడం, అధిష్ఠానం సానుకూలంగా స్పందించడాన్ని 'దాడి' కుటుంబం తట్టుకోలేకపోయింది. పార్టీ కోసం పనిచేస్తూ సొంత సొమ్ము ఖర్చు చేస్తున్నప్పటికీ పెద్దల కరుణ లేకపోవడం, వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి టికెట్‌పై భరోసా లభించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందినట్టు తెలిసింది. ఆత్మ వంచన చేసుకుంటూ ఇటువంటి పార్టీలో ఉండలేమన్న ఉద్దేశంతో మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు ఏకవాక్యంతో లేఖ రాసి పంపారు.

నేడు టీడీపీలోకి 'దాడి' కుటుంబం

వైసీపీకి రాజీనామా చేసిన దాడి వీరభద్రరావు, ఆయన కుమారులు, అనుచరులు బుధవారం అమరావతిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నారు. దాడి వీరభద్రరావు తన రాజకీయ జీవితాన్ని తెలుగుదేశం పార్టీతోనే మొదలుపెట్టారు. 1985లో తొలిసారి అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. 1987లో రాష్ట్ర సమాచార శాఖ మంత్రిగా, 1989 జనవరిలో ఆర్టీసీ రీజియన్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1989, 1994, 1999 ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో ఎన్టీఆర్ క్యాబినెట్‌లో సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2004, 2009 ఎన్నికల్లో ఓటమి చెందారు. ఆ తరువాత టీడీపీ తరపున శాసనమండలి సభ్యుడిగా ఎన్నియ్యారు. శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. వీరభద్రరావు చిన్న కుమారుడు దాడి రత్నాకర్ 2012-13 మధ్య కాలంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు.

కొణతాలతో కేవీపీ మంతనాలు?

... 5వ పేజీ తరువాయి

తిప్పల కుటుంబం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు సమాచారం. ఈ కుటుంబానికి గతంలో కాంగ్రెస్ పార్టీతోనే సుదీర్ఘ అనుభవం ఉంది. ఆ పార్టీ నుంచే తిప్పల సోదరుడు గురుమూర్తిరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వీరంతా కొణతాలకు శిష్యులు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి షర్మిల సారథ్యం వహించనున్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గాజువాక నుంచి పోటీ చేయడానికి అవకాశం ఇస్తే ఆ పార్టీలో చేరడానికి నాగిరెడ్డి కుటుంబం ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది.